చకచకా పైప్‌లైన్ పనులు

మంజీరా మంచినీటి లైన్ పనులు రెండు కిలోమీటర్లు పూర్తి..



మంజీరా రోడ్డులో నూతన పైప్‌లైన్ ఏర్పాటునకు సిద్ధం చేసిన పైపులు

హఫీజ్‌పేట్: లింగంపల్లి– హఫీజ్‌పేట్ మంచి నీటి రిజర్వాయర్ వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర రూ.41 కోట్లు నిధులతో చేపట్టిన మంజీరా పైప్‌లైన్ పనులు చకచకా సాగుతున్నాయి. ఇప్పటి వరకు రెండు కిలోమీటర్లు పైప్‌లైన్ పనులు పూర్తి అయ్యాయి. మిగతా 4 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం వర్షాకాలం నాటికి పూర్తవుతుందని అంచనా.

◆ దశాబ్దాల కాలం క్రితం నిర్మించిన పైప్‌లైన్‌లు నిత్యం లీకేజీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో లింగంపల్లి నుంచి హఫీజ్‌పేట్ వరకు లీకేజీలతో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. స్థానిక ప్రజలు మంజీరా పైప్‌లైన్ నూతనంగా నిర్మించాలని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ప్రత్యేక చొరవ తీసుకొని నూతన మంజీరా



పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయంటూ ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

పైప్‌లైన్ నిర్మాణానికి నిధులు కేటాయించి అక్టోబర్‌లో పనులకు శంకుస్థాపన చేశారు. పైప్‌లైన్లు వేసిన తర్వాత రాకపోకలను ఆపివేయకపోవడంతో ఆ రూట్‌లో వచ్చే ద్విచక్ర వాహనాలు రోడ్డులో దిగబడిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్ వేసిన వెంటనే మట్టి పోసి బీటీ రోడ్డు వేయాలని కోరుతున్నారు. లేదా ఈ రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిపి వేస్తే ప్రమాదాలు జరగవని వాహనదారులు, స్థానికులు పేర్కొంటున్నారు.

ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలి



నూతన మంజీరా పైప్‌లైన్ వేయడం ఆనందం. అయితే పనులు చేపట్టేటప్పుడు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాంట్రాక్టర్ చర్యలు తీసుకోవాలి. దశాబ్దకాలం నాటి సమస్యకు పరిష్కారం దొరకడం సంతోషకరం. –గౌస్, హఫీజ్‌పేట్

నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలి



లింగంపల్లి– హఫీజ్‌పేట్ మంచినీటి రిజర్వాయర్ వరకు చేపట్టిన పైప్‌లైన్ పనులలో నాణ్యత పాటించడంతో బాటు వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేయాలి. ఎప్పటికప్పుడు రోడ్డు మరమ్మతులు చేసి ఇబ్బందులు కలగకుండా చూడాలి. – జంగయ్యగౌడ్, ఓల్డ్ హఫీజ్‌పేట్

అన్నమయ్యపురంలో శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకం



కార్యక్రమంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు, శోభారాజు తదితరులు

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శ్రీ వేంకటేశ్వరస్వామి శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకం కార్యక్రమాలను రెండవరోజు సోమవారం నిర్వహించారు. అన్నమాచార్య భావన వాహిని విద్యార్థులు అన్నమయ్య కీర్తనలను ఆలపించి సందర్శకులను అలరించారు. సంకీర్తనల స్వరార్చనకు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో విశ్వయోగి విశ్వంజీ మహరాజు, వాదిరాజాచార్య స్వాములు తమ ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. సంస్థ అధ్యక్షులు పద్మశ్రీ డాక్టర్ శోభారాజు కళాకారులను సత్కరించారు.

వాటర్ ప్లాంట్‌లను తొలగించండి



వాటర్ ప్లాంట్లను తొలగించాలని ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేసిన ఊట్ల చంద్రారెడ్డి, స్థానికులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండల పరిధిలోని పాపిరెడ్డినగర్ బస్తీలో అక్రమ వాటర్ ప్లాంట్ల నిర్వహణతో బస్తీవాసులు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని వాటర్ ప్లాంట్లను తక్షణమే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. సోమవారం బస్తీ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి సమక్షంలో పెద్ద ఎత్తున స్థానికులు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి వినతి పత్రం అందజేశారు. అరా, కొర వస్తున్న నీటిని వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు తోడేస్తు సొమ్ము చేసుకుంటున్నారని, వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి పోయి నీటి కొరత ఏర్పడిందని వాపోయారు. నేడు బోరు వేయాలంటే సుమారు 1500 ఫీట్ల వరకు వేయాల్సి వస్తుంది. ఇప్పటికే బస్తీలో ఉన్న వాటర్ ప్లాంట్లకు తోడుగా రోడ్డు నెంబర్ 16 బ్లాక్ సిలో మరో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, సిహెచ్ రామకృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వీరన్న, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, బస్తీవాసులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో బీజేపీని గెలిపించాలి

హఫీజ్‌పేట్: బీజేపీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తాయని ఆ పార్టీ శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పార్టీ కార్యాలయంలో బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంచార్జీలు, జిల్లా, రాష్ట్ర నాయకులు, బీజేవైఎం మహిళా మోర్చా నాయకులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ళ ఎంపీగా కొండ విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్‌లో అత్యధికంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కొండ విశ్వేశ్వర్‌రెడ్డి సోదరిమణి అనితారెడ్డి, కన్వీనర్ రాఘవేంద్రరావు, అధ్యక్షులు శ్రీధర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, శ్రీనివాస్, పృథ్వీగౌడ్, రమణయ్య, అశోక్, రవి, రాజు, జితేందర్ జిల్లా, డివిజన్ పదాధికారులు, ఓబీసీ మోర్చా, మహిళా మోర్చా, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం స్వామి, భ్రమరాంబ దేవి, శ్రీ క్యాతమ్మ దేవతల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ మహోత్సవంలో ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గౌతమ్‌గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్, దాత్రినాథ్ గౌడ్, రామకృష్ణ గౌడ్, మహేందర్, సాయి, వెంకటేష్, బాబుమోహన్ మల్లేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నగరంలో ముజిగల్ అకాడమీ సేవలు

సాక్షి, సిటీబ్యూరో: సంగీత శిక్షణకు దేశవ్యాప్తంగా పేరొందిన ముజిగల్ అకాడమీ నగరంలో తన నూతన శాఖను ఏర్పాటు చేసింది. బీరంగూడలో ఈ అకాడమీ నెలకొల్పిన సందర్భంగా ప్రముఖ నేపథ్య గాయని అనన్య భాస్కర్ హాజరై చిన్నారులు, సంగీత శిక్షణార్థులతో కలిసి ఆడి పాడి అలరించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు డా.లక్ష్మీనారాయణ యేలూరి మాట్లాడుతూ దాదాపు 1500చ.అ. విస్తీర్ణంలో నెలకొల్పిన ఈ అకాడమీ ద్వారా అత్యుత్తమ సంగీత శిక్షణ సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు సంగీతాభిమానులు పాల్గొన్నారు.

ఓటు అవగాహన ర్యాలీ



శంషాబాద్: ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ బి. సుమన్‌రావు సూచించారు. సోమవారం మున్సిపల్ కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. చైతన్య కార్యక్రమాల్లో పౌరులు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



భాస్కర్‌కు కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించిన రంజిత్ రెడ్డి, దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి సమక్షంలో సోమవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పీజేఆర్ నగర్‌కు చెందిన సీనియర్ నాయకుడు సి.హెచ్.భాస్కర్ పార్టీలో చేరారు. భాస్కర్‌కు రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, అనిల్ రెడ్డి, యాదగిరి, పోశెట్టి గౌడ్, మోజెస్, రవీందర్, బాలస్వామి సాగర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



హోమంలో పాల్గొన్న భక్తులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని మల్లికార్జుననగర్ కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ 9వ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. గణపతి నవగ్రహ రుద్ర హోమము, శ్రీహనుమాన్ చాలీసా పారాయణం, శ్రీఆంజనేయ స్వామి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు నగేష్, ఆదర్శ్ రెడ్డి, అలయ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

అబ్బాయిల్లోనే ఆటిజం ఎక్కువ

సైక్రియాటిస్ట్ డాక్టర్ చరణ్ తేజ



గచ్చిబౌలి: అమ్మాయిల కంటి అబ్బాయిల్లోనే ఆటిజం నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుందని కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రి సైకియాట్రిస్ట్ డాక్టర్ చరణ్ తేజ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన ఆటిజం గురించి వివరించారు. మెదడులోని కొన్ని భాగాలలో ఇన్‌పుట్, ప్రాసెస్ లాంగ్వేజ్‌ని అర్థం చేసుకునే సమస్యల నుంచి ఆటిజం ఉత్పన్నమవుతుందన్నారు. ఇతర వ్యక్తులు ఏమంటున్నారో తెలుసుకోవడంలో ఆటిజం పిల్లలు ఇబ్బందిపడతారని పేర్కొన్నారు. కంటి చూపు లేకపోవడం, చెప్పిన పదాలే పదే పదే చెప్పడం, శబ్దాలు, స్పర్శ, సంజ్ఞలు, దృశ్యాలను పసిగట్టలేకపోవడం తదితర సమస్యలు ఆటిజం ఉన్న వారిలో ఉంటాయన్నారు. బిహేవియర్ థెరపీ, ఇంద్రియ ఏకీకరణ, కమ్యూనికేషన్ థెరపీ ద్వారా ఆటిజం పిల్లల్లో మార్పు తేవచ్చని వివరించారు.

అశ్వవాహనంపై ఊరేగిన వీరభద్రుడు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

జిన్నారం(పటాన్‌చెరు): వీరన్నగూడ గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అశ్వవాహనంపై వీరభద్రున్ని ఊరేగించారు. ఉత్సవాల్లో భాగంగా ఈఓ శశిధర్, ఆలయ పర్యవేక్షకులు సోమయ్యల ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లే కుండా చర్యలు చేపట్టారు. సోమవారం స్వామివారి సన్నిధిలో కాంగ్రెస్ నేత ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో అభిషేకం, అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చనలు చేపట్టారు. బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని దేవాలయ అధికారులు సూచించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని పంచలోహంతో తయారు చేసిన తొడుగుతో ముస్తాబు చేశారు.

ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని వినతి

రాజేంద్రనగర్: ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి ప్రాంతాలకు చెందిన మహిళలు రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ రవి కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. కోఠి నుండి ఉప్పర్‌పల్లి మీదుగా రాజేంద్రనగర్ వరకు గతంలో 94యు, 92ఎం బస్సులు నడిచేవని ఈ బస్సులు హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి మీదుగా రాజేంద్రనగర్‌కు వెళ్లేవని తెలిపారు. కరోనా అనంతరం ఈ బస్సులు నేరుగా ప్రధాన రహదారి గుండా వెళ్లేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. దీంతో తామంతా హైదర్‌గూడ బస్టాపు వద్దకు వచ్చి బస్సులను ఎక్కాల్సి వస్తుందని ఆరోపించారు. దాదాపు మూడు, నాలుగు కిలోమీటర్లు నడిచి వచ్చి బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి మీదుగా బస్సులను నడిపిస్తే మహిళలు, వృద్ధులు, విద్యార్థులు వివిధ పనుల నిమిత్తం నగరానికి వెళ్లే వారికి ఇది అనుకూలంగా ఉంటుందన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని కోరారు.

సొంత భవనం ఊసేది?



తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న మున్సిపల్ కార్యాలయం

- కమ్యూనిటీ భవనంలో మున్సిపల్ కార్యాలయం
- ఇబ్బందులు పడుతున్న అధికారులు, సిబ్బంది

జిన్నారం(పటాన్‌చెరు): ఏడాదికి సుమారు రూ.12 కోట్ల ఆదాయం.. మున్సిపాలిటీగా ఆవిర్భవించి నాలుగేళ్లు.. కొత్త భవనం కోసం కౌన్సిల్‌లో తీర్మానం చేసినా జాప్యం జరుగుతూనే ఉంది. సరిపడా భవనం లేకపోవటంతో అధికారులు, సిబ్బంది ఇ బ్బంది పడుతున్నారు. త్వరగా భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

◆ జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపాలిటీగా ఆవిర్భవించి నాలుగేళ్లు గడుస్తుంది. అప్పట్లో గ్రామపంచాయతీ భవనంలోనే మున్సిపల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఇది శిథిలావస్థకు చేరడంతో కేబీఆర్ కాలనీలోని కమ్యూనిటీ భవనంలో సుమారు రూ.10 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేసి కార్యాలయాన్ని ఇందులోకి తరలించారు. అయితే ఈ పాత భవనాన్ని కూల్చివేసి ఇక్కడే నూతన భవనాన్ని నిర్మించాలనే ఆలోచనతో అధికారులు, ప్రజాప్రతినిధులు భవన నిర్మాణం కోసం రూ. 4కోట్ల ఖర్చు అవుతాయని అంచనా వేశారు. కౌన్సిల్ తీర్మానం కూడా జరిగింది. తీర్మానం జరిగి ఏడాది గడుస్తున్నా నూతన భవనం ఊసే లేదు. మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, బిల్ కలెక్టర్‌లు, వార్డు అధికారులతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది మొత్తం 90మంది వరకు ఉంటారు. అధికారులు, సిబ్బందికి సరిపడా గదులు అందుబాటులో లేవు. మున్సిపల్ పరిధిలో 22 వార్డులు ఉండగా, 22మంది కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులతో పాటు పది మంది వరకు వివిధ శాఖల అధికారులు కూర్చునేందుకు సరిపడా సమావేశ మందిరం కూడా లేదు. దీంతో అధికారులు, కౌన్సిలర్‌లు, మున్సిపల్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ నూతన భవనాన్ని నిర్మించేందుకు సరిపడా నిధులు లేవని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా బొల్లారం మున్సిపల్ పరిధిలో 150వరకు వివిధ రకాల పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ నిధులతో మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేస్తుంటారు. కాగా సీఎస్ఆర్ నిధులతో మున్సిపల్ భవనాన్ని నిర్మించేందుకు యాజమాన్యాలు సిద్ధంగా ఉన్నా ఇక్కడి పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అప్పటి పాలకుల నిర్లక్ష్యం వల్లే..

అప్పటి పాలకుల నిర్లక్ష్యం వల్లే నిధులు ఆగిపోయాయి. నూతన భవనాన్ని నిర్మించే విషయమై అధికారులకు చాలాసార్లు సూచించాం. భవన నిర్మాణానికి సీఎస్ఆర్ నిధులు సేకరించాలి. కొత్త భవనాన్ని నిర్మించే విషయంను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. – చంద్రారెడ్డి, కౌన్సిలర్, బొల్లారం

ఉన్నతాధికారులకు నివేదించాం

మున్సిపల్ కార్యాలయ భవనం విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతం ఉన్న భవనంలో తగిన వసతులను కల్పించేలా ఏర్పాట్లు చేశాం. –మంగతాయారు, మున్సిపల్ కమిషనర్, బొల్లారం

నీటి సమస్య ఉంటే ఫోన్ చేయండి

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా మంచి నీటి సమస్య ఉంటే ఫోన్ లేదా వాట్సాప్‌లో సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ బి. సుమన్‌రావు సూచించారు. మున్సిపల్ కమిషనర్ బి. సుమన్‌రావు (7337336191), ఏఈ నరేష్, 7337323577 నంబర్లలో సంప్రదిస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

కిరాణా షాపులో గంజాయి విక్రయం

300 గ్రాముల గంజాయి స్వాధీనం.. కేసు నమోదు



అనురాధబాయి



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

గచ్చిబౌలి: కిరాణా షాపులో 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితురాలిని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు. నానక్‌రాంగూడలో కిరాణ షాపు నిర్వహిస్తున్న అనురాధ బాయి(39) గుట్టుచప్పుడు కాకుండా విద్యార్థులు, కూలీలకు గంజాయి విక్రయిస్తోంది. ధూల్‌పేట్ నుంచి గంజాయి తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లలో అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు ఆదివారం రాత్రి దుకాణంపై దాడి చేశారు. నిందితురాల నుంచి 300 గ్రాముల 39 గంజాయి ప్యాకెట్లు, రూ.1200 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. ఆమెకు నోటీసులు ఇచ్చామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గచ్చిబౌలి సీఐ ఆంజనేయులు తెలిపారు.

'మనూ' పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీ



అమీనా బేగమ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పరిశోధక విద్యార్థిని అమీనాబేగంకు సోమవారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. కామర్స్ విభాగంలో పరిశోధక విద్యార్థిని ఆ విభాగం ప్రొఫెసర్ బదియుద్దీన్ అహ్మద్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆమెకు సహ పర్యవేక్షకులుగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ ప్రొఫెసర్ ఎస్ శ్రీనివాస మూర్తి వ్యవహరించారు. ఆమె 'సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్ సెలెక్ట్ ఎంటర్‌ప్రైజెస్ ఆఫ్ సౌత్ ఇండియా' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించగా పరిశీలించి డిగ్రీని ప్రకటించారు.

చిరునామా, పిన్‌కోడ్ కరెక్ట్‌గా ఉండాలి

కొత్తగూడ పోస్టాఫీస్ అధికారులు

రాయదుర్గం: చిరునామా, పిన్‌కోడ్ సరిగా లేకపోతే ఉత్తరాలు చేరవలసిన ప్రదేశానికి చేరడం లేదని కొత్తగూడ పోస్టాఫీస్ అధికారులు సోమవారం తెలిపారు. చిరునామాదారుడి ఫోన్ నెంబర్ కూడా రాస్తే సులభంగా చేర్చడానికి అవకాశం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. పలువురు చిరునామా, పిన్‌కోడ్ సక్రమంగా రాయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీరామ్‌నగర్ అన్ని బ్లాక్‌లు, రాఘవేంద్రకాలనీ, గోపాల్‌రెడ్డి నగర్,మసీదుబండ, ఆనంద్‌నగర్, శిల్పాపార్కు, ఆర్‌టీఓ ఆఫీస్, సీఆర్ ఫౌండేషన్, పరిసర ప్రాంతాలు, అంజయ్యనగర్, పరిసర కాలనీలు, బస్తీలు, జాగృతికాలనీ, ప్రశాంత్‌నగర్, శరత్‌సిటీమాల్, బొటానిల్‌గార్డెన్ పరిసర కాలనీలు, బస్తీలు, మై హోమ్‌మంగళ, శిల్పాగార్డెన్, ఇజ్జత్ నగర్, ఖానామెట్, శిల్పాహిల్స్,న్యాక్ పరిసర కాలనీలు, బస్తీలలోని ఉత్తరాలను కొత్తగూడ పోస్టాఫీస్ పరిధిలో బట్వాడా చేయడం జరుగుతోందని వారు వివరించారు.

చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

4 నుంచి 6 వరకు నిర్వహణ



రాయదుర్గం: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల గృహ సముదాయం గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో కొలువుదీరిన రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజులపాటు ఉత్సవాలను నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. శైవాగమ శాస్త్ర ప్రకారం ఉత్సవాలు జరుగుతాయి. గురువారం ఉదయం 8.45 గంటలకు భూతబలి, గణపతి పూజతో ఉత్సవాలను ఆరంభిస్తారు. అనంతరం పుణ్యాహవచనం, పంచగవ్యం, దీక్షాధారణ, అస్త్రరాజార్చన, ప్రధాన కుంభావాహన నీరాజన మంత్రపుష్పములు నిర్వహిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు అంకురారోపణ, అగ్నిప్రతిష్టాపన, ధ్వజారోహణ, బలిహరణ, రాజరాజేశ్వరీ చంద్రమౌళీశ్వరుని కళ్యాణం, నీరాజన మంత్ర పుష్పములు నిర్వహిస్తారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

ఏసీపీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు

మూసాపేట: వేసవికాలంలో జరిగే అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎస్ఆర్ గార్డెన్స్‌లో గోడౌన్స్, కంపెనీలు, పరిశ్రమలు, పేపర్స్, బాటిల్స్ గోడౌన్స్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోడౌన్స్, కంపెనీలు, భవనాల వద్ద ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అగ్నిమాపక యంత్రాలు సమకూర్చుకోవాలని సూచించారు. ఏదైనా సంఘటన జరిగిన వెంటనే అగ్నిమాపక కేంద్రం, పోలీస్‌స్టేషన్, అత్యవసర సేవలకు తెలియజేయాలని, ఆలస్యం అయ్యే కొద్ది ప్రమాద తీవ్రత పెరుగుతుందని తెలిపారు. అగ్నిమాపక శాఖ సూచించిన మార్గదర్శకాలు, నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్, కేపీహెచ్‌బీ వెంకటేశ్వరరావు, బాచుపల్లి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర..



రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని మందుమూల శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న మల్లన్న జాతరలో భాగంగా సోమవారం ఘటం ఊరేగింపు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్పొరేటర్ పుష్పనగేష్ పాల్గొన్నారు.